పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్‌ఎఫ్ దోహదం

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో దోహదపడుతోందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ త్యాగరాయకాలనీలో నివాసముండే అలివేళమ్మ మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ చికిత్స చేయించుకుంది. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండడంతో ఎమ్మెల్యేను సంప్రదించగా సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ మేరకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితురాలి భర్త మల్లారెడ్డికి శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తిలక్‌రావు, కృష్ణ పాల్గొన్నారు.



లెప్రసీ కుటుంబాలతో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులు

మానవతాదృక్పథంతో ఎన్‌జీఓలు పనిచేయాలి

● సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మానవతాదృక్పథంతో ఎన్‌జీఓ సంస్థలు పనిచేయాలని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి అన్నారు. శనివారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాముల పరిధిలోని సంతోష్‌నగర్ లెప్రసీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్‌కు చెందిన సాయి భక్తులు, దాతలు జనార్దన్‌రావు, సురేష్‌చంద్ర ఆధ్వర్యంలో 25 లెప్రసీ బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, మరో 70 కుటుంబాలకు నూతన వస్త్రాలను జగ్గారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెప్రసీ వ్యాధిగ్రస్తులకు తోచిన సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో స్లాప్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రమేష్, పుల్లయ్య, పెంటయ్య, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన



హయత్‌నగర్ కోర్టులో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్

హయత్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని 14వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ 6వ కోర్టు అదనపు జడ్జి శ్రద్ధా సెగల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 1055 కేసులను కక్షిదారులు రాజీ కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో రిటైర్ జడ్జి జయసింహారావు, ఏసీపీ కాశీరెడ్డి, హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం : కార్పొరేటర్ బద్దం

దిల్‌సుఖ్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నేటి యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉందని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి సూచించారు. అపోలో ఆస్పత్రి వారి సౌజన్యంతో మలక్‌పేట, ఎల్బీనగర్ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శనివారం మధురాపురికాలనీ స్వర్ణకార వీధిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జయప్రకాష్, విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవాచారి, విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు శ్రీరామదాసు రవిచారి, గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి తుడిమిళ్ల లవకుమార్, కోశాధికారి వెంకటరమణ, ఉపాధ్యక్షులు శ్రీరామదాసు వెంకటాచారి, శ్రీనివాసచారి, బాహోజు రవి పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు చేయాలి

చాదర్‌ఘాట్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీలు, మురికివాడల్లో వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయాలని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి అన్నారు. శనివారం మూసారాంబాగ్ డివిజన్‌లోని శ్రీపురంకాలనీ దేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ వద్ద పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. పేరుకుపోయిన చెత్త, చెట్లకొమ్మలు, ఫుట్‌పాత్‌పై వ్యర్థాలను వెంటనే తొలగించాలని కార్పొరేటర్ శానిటేషన్ సిబ్బందికి సూచించారు. శ్రీపురంకాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని అపార్ట్‌మెంట్ వాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగం జవాన్ రమేష్, ఎస్‌ఎఫ్‌ఏ నర్సింగ్, కాలనీ వాసులు దత్తు, కొండారెడ్డి, సురేష్, పరశురాం, రామకృష్ణ, సందీప్ పాల్గొన్నారు.



వీధి వ్యాపారులకు తోపుడు బండ్లను అందజేస్తున్న శశిధర్, చంద్రశేఖర్

వీధి వ్యాపారులకు తోపుడు బండ్ల పంపిణీ

ఎల్బీనగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారాలు చేసుకునే నిరుపేద హిందూ కుటుంబాలకు విశ్వహిందూ పరిషత్, జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం వేయింగ్ మిషన్లు, తోపుడు బండ్లను అందజేశారు. సరూర్‌నగర్ హుడా కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్యం, సేవా భారతి క్షేత్ర సంఘటనా మంత్రి ఎక్కా చంద్రశేఖర్, జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఉదయ్ కర్కరే, ప్రాజెక్ట్ సెక్రటరీ భిక్షపతి, బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అరుట్ల సురేష్, జిల్లా అధికార ప్రతినిధి బెంగరబోయిన సురేష్‌లు తోపుబండ్లు, వెయింగ్ మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనహిత సేవా సమితి కోఆర్డినేటర్ మహేష్, హుడా కాంప్లెక్స్ షా అసోసియేషన్ అధ్యక్షుడు అనుప్‌రాజ్, భజరంగ్‌దల్ సభ్యులు పులిమద్ది సుధాకర్, బాలరాజ్, రాంకుమార్, కిషోర్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలి

వనస్థలిపురం: సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎఫ్‌డీఆర్‌డీఓ సైంటిస్ట్ రమేష్‌కుమార్ అన్నారు. వనస్థలిపురంలోని భాష్యం లిటిల్ ఛాంప్స్ పాఠశాల 14వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉంటు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని రాణించాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటు ఉన్నత లక్ష్యాలను సాధించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇన్‌చార్జి అంకమరావు, ప్రధానోపాధ్యాయురాలు సుజాత, హేమంత లక్ష్మి పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన నోవా కళాశాల

● యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జాఫర్‌గూడ చెరువు బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేస్తున్న క్రమంలో విధులకు ఆటంకం కలిగించిన నోవా కళాశాల యాజమాన్యం, సిబ్బందిపై ఇరిగేషన్ ఏఈ వంశీ అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జాఫర్‌గూడ చెరువు బఫర్ జోన్ పరిధిలో నోవా కళాశాల అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతో వాటిని తొలగించేందుకు రెండు రోజుల క్రితం ఇరిగేషన్ ఏఈ వంశీ, సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లారు. బఫర్ జోన్‌లోని నిర్మాణాలను తొలగిస్తున్న క్రమంలో కళాశాల యాజమాన్యంతో పాటు సిబ్బంది తమ విధులకు ఆకంటం కలిగించడంతో పాటు దుర్భాషలాడుతూ సెల్ ఫోన్‌లు లాక్కునేందుకు యత్నించారు. దీంతో ఏఈ వంశీ కళాశాల యాజమాన్యంతో పాటు సిబ్బందిపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్



డైట్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్



సీఓఈ కళాశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన

ప్రభుత్వ వసతి గృహాల్లో పండగ

- మామిడాకులు, పూలతో అలంకరణ
- గుమగుమలాడిన వంటశాలలు
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అధికారులు
- పెంచిన మెస్‌చార్జీలతో విద్యార్థుల సంబరాలు

హయత్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు 40శాతం మెస్ చార్జీలను పెంచుతూ కొత్త మెనూను ప్రవేశపెట్టారు. దీంతో అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో శనివారం పండగ జరిపారు. వసతి గృహాలను పచ్చని మామిడి ఆకులు, పూలతో సుందరంగా అలంకరించారు. తరగతి గదులను, వంటశాలలను శుభ్రం చేశారు. రంగు కాగితాలతో అలంకరించారు. బిర్యాని వంటకాలతో వంటశాలలు గుమగుమలాడాయి. వెరసి శనివారం అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో పలువురు ఉన్నతాధికారులు, ఇతర అధికారులు గురుకులాలను సందర్శించి విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి పండగ చేసుకున్నారు. ప్రభుత్వం కేటాయించిన ప్రత్యేక అధికారులు తరగతి గదులను, హాస్టల్ పరిసరాలను, వంటశాల, పరిశుభ్రత గల నీటిని, వంట సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను, పోటీలను ఏర్పాటు చేశారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. హయత్‌నగర్‌లోని తెలంగాణ ఆదిమ గిరిజన గురుకుల బాలుర కళాశాలలో తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఉప కార్యదర్శి లింగారెడ్డి, తెలంగాణ మైనారిటీ రెసిడెన్సియల్ బాలికల పాఠశాలలో హయత్‌నగర్ తహసీల్దార్ జానకి, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, చీఫ్ ప్లానింగ్ అండ్ స్పెషల్ యూనిఫాం డైట్ ఆఫీసర్ సౌమ్య, ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, ప్రిన్సిపాల్ జ్యోతి, కల్వంచ శాంతి నగర్‌లోని ఇబ్రహీంపట్నంకు చెందిన బీసీ బాయిస్ హాస్టల్‌ను రంగారెడ్డి జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వి. వెంకటేశ్వర్లు, వార్డెన్ కవిత, కమ్మగూడలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్సియల్ బాలికల పాఠశాలలో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ కొశిక ఐలయ్య సందర్శించి కొత్త మెనూను ప్రారంభించారు.



గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఐఏఎస్ అధికారి అనితారామచంద్రన్

ఆస్మాన్‌ఘడ్, చంపాపేట్‌లలో..

సైదాబాద్ : ఆస్మాన్‌ఘడ్‌లోని ప్రభుత్వ బాలుర మైనార్టీ గురుకుల పాఠశాలలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, చంపాపేటలోని మైనార్టీ గురుకుల పాఠశాల ముషీరాబాద్-1లో తెలంగాణ బయోడైవర్సీ బోర్డు సెక్రెటరీ కాళీచరణ్, యాకుత్‌పురా-2లో ఎమెల్సీ అమీర్ అలీఖాన్‌లు శనివారం కామన్ డైట్‌ను ప్రారంభించారు. పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి సామూహిక భోజనం చేశారు.

ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ సీఓఈ కళాశాలలో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ సీఓఈ కళాశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ కాలేజీయెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేనా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేరుగా కిచెన్‌లోకి వెళ్లి వంటల తీరును పరిశీలించారు. స్టోర్ రూంలోకి వెళ్లి ప్రభుత్వం సరఫరా చేస్తున్న రైస్‌ను తనిఖీ చేశారు. అక్కడి సమస్యలను కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నూతన కామన్ డైట్ మెనూను ఆవిష్కరించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కొత్తగూడెంలోని గురుకుల స్కూల్‌లో జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీవత్స హాజరై కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. బాటసింగారంలోని గురుకుల స్కూల్‌లో రాచకొండ సీపీ సుధీర్‌బాబు హాజరై కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. రాచకొండ ట్రాఫిక్ డీసీపీ నర్సింహ, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, సుధాకర్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి: అనితారామచంద్రన్



బాటసింగారంలోని గురుకుల స్కూల్‌లో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

మన్సూరాబాద్: ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులకు క్రమం తప్పకుండా మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలంగాణ రాష్ట్ర మహిళ, శిశు, వికలాంగ, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ అభివృద్ధి శాఖ కార్యదర్శి అనితారామచంద్రన్ ఆయా పాఠశాలలు, హాస్టళ్ల నిర్వాహకులు, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శనివారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని జ్యోతిరావు పూలె బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూను ఐఏఎస్ అధికారి అనితారామచంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సరదాగా గడిపిన ఆమె వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం హయత్‌నగర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్-5 అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

నాగోల్‌లో..

నాగోల్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో సాధారణ ఆహార మెనూని కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, హాస్టల్ వార్డెన్ పాల్గొన్నారు.

న్యూ నాగోల్ ప్రభుత్వ ఎస్టీ హాస్టల్‌లో..

కొత్తపేట : న్యూనాగోల్‌లోని ప్రభుత్వ ఎస్టీ హాస్టల్‌లో కార్పొరేటర్ పవన్ కుమార్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు న్యూ కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. అనంతరం బాత్రూమ్స్‌లో నీటి సరఫరాను, ఇతర సదుపాయాలను పరిశీలించారు. కొత్తమెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయాలని, స్నానాల గదుల్లో మరమ్మతు పనులు చేపట్టాలని వార్డెన్ గోపాల్‌రెడ్డికి సూచించారు.

నందనవనంలో..

చంపాపేట: హస్తినాపురం డివిజన్ నందనవనం హనుమాన్‌నగర్ కాలనీలోని చంద్రాయణగుట్ట మైనారిటీ బాలుర గురుకుల కళాశాలను శనివారం మీర్‌పేట ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, దివ్యాంగుల వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఏ.రాజేందర్‌లు సందర్శించి కామన్ డైట్ మెనూ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో కంప్యూటర్, యోగా, బ్రెయిలీ శిక్షణ కేంద్రం

● ప్రారంభించిన కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే



కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేకు వినతిపత్రం సమర్పిస్తున్న ఫెడ్ సంస్థ చైర్మన్ గంగారాం, నాగభూషణం తదితరులు

చాదర్‌ఘాట్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ మాసోత్సవాల్లో భాగంగా మలక్‌పేటలోని లూయిస్ బ్రెయిలీ పార్క్‌లో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రాందాస్ అథవాలే ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూర్, యోగా, బ్రెయిలీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఫెడ్ సంస్థ చైర్మన్ గంగారాం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణంతో కూడిన పలు సంఘాల ప్రతినిధుల బృందం కేంద్ర మంత్రిని కలిసి సికింద్రాబాద్‌లోని నిర్వహిస్తున్న అంధుల ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని బోయిన్‌పల్లిలోని జాతీయ మానసిక దివ్యాంగుల సంస్థలో కలపాలని విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు వివరించారు. అంతకుముందు లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి కేంద్ర మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే పలు కార్యక్రమాలను వివరించారు. పలువురు దివ్యాంగులకు కుట్టు మిషన్లు, చంక కర్రలు, అంధులకు చేతి కర్రలను ఆయన పంపిణీ చేశారు.

సమాజాభివృద్ధిలో సీనియర్ సిటిజన్స్ కృషి ఎనలేనిది

● రాష్ట్ర రోడ్డు, రవాణా అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

మన్సూరాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో సీనియర్ సిటిజన్ల కృషి ఎనలేనిదని రాష్ట్ర రోడ్డు, రవాణా అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. నాగోల్ బండ్లగూడలోని మధురానగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం 5వ వార్షికోత్సవం, ఆత్మీయ సమ్మేళన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మల్‌రెడ్డి రాంరెడ్డితో పాటు స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిలు విచ్చేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ఎకరా ప్రభుత్వ స్థలంలో సీనియర్ సిటిజన్స్‌కు భవనం నిర్మించేందుకు రూ.15లక్షల సాయం చేస్తానన్నారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లుగా సీనియర్ సిటిజన్లకు కూడా కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం కాలనీలో వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు బాక్స్‌డ్రైన్ల నిర్మాణం, సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు సీనియర్ సిటిజన్స్ భవనం అభివృద్ధికి కృషిచేయాలని మధురానగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు వినతిపత్రం ద్వారా మల్‌రెడ్డి రాంరెడ్డిని కోరారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మంజులారెడ్డి, నాయకులు సంకెపల్లి సుధీర్‌రెడ్డి, పన్యాల జైపాల్‌రెడ్డి, గుర్రం శ్యాంచరణ్‌రెడ్డి, ఉదయ్, లోకేష్‌రెడ్డి, హయత్‌నగర్ ఆసరా సంఘం అధ్యక్షుడు యాదిరెడ్డి, కార్యదర్శి హరినాథ్‌బాబు, డాక్టర్ నాగేశ్వరరావు, మధురానగర్‌కాలనీ అధ్యక్షుడు మోహనాచారి, కార్యదర్శి కేవీ నర్సింహారెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

18,19 తేదీల్లో వస్తువుల వేలం

చాదర్‌ఘాట్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లోని కార్గో, పార్శిల్ కొరియర్ సర్వీసెస్ కౌంటర్‌కు చేరి డెలివరీ తీసుకోని కస్టమర్ల వస్తువులను ఈనెల 18, 19వ తేదీల్లో వేలం నిర్వహించనున్నట్లు ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి లాజిస్టిక్ మేనేజర్ రవీందర్ తెలిపారు. ఈ వేలంలో ఎలక్ట్రిక్ వస్తువులు, ఐరన్, బైక్, కార్ల విడిభాగాలు, కంప్యూటర్ స్పేర్ పార్ట్స్, దుస్తులు, ప్లాస్టిక్, బుక్స్ రెగ్జిన్, ఇతర వస్తువులు ఉన్నట్లు ఆయన వివరించారు. వేలం పాటను మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లోని లాజిస్టిక్ గోడౌన్ ఆవరణలో ఉదయం 10గంటకు ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం 9391998825, 9154298865 ద్వారా సంప్రదించవచ్చన్నారు.

గ్రూప్-2 అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు


హయత్‌నగర్ : గ్రూప్- 2 పరీక్ష రాయనున్న అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు హయత్‌నగర్-1 ఆర్టీసీ డిపో మేనేజర్ విజయ్ తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పరీక్షల కోసం ఎల్బీనగర్, హయత్‌నగర్ బస్టాండ్‌లలో ప్రత్యేక హెల్ప్ డెస్కులను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నగరశివారు మజీద్‌పూర్‌లోని అవంతి, కేవీకే కళాశాల సెంటర్ అభ్యర్థుల కోసం ఎల్బీనగర్ పాయింట్ నుంచి ఉదయం ఏడు గంటల నుంచే ప్రతి 15నిముషాలకు ఒక బస్సు చొప్పున నడిపిస్తామని అన్నారు. కుంట్లూర్ పల్లవి కళాశాల సెంటర్‌కు వెళ్లేందుకు హయత్‌నగర్ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రూప్-2 అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్ 9700000459, 9154537944లలో సంప్రదించాలన్నారు.

హుండీ చోరీకి యత్నించిన పాత నేరస్థుడు అరెస్టు

కొత్తపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధి మన్సూరాబాద్‌లోని అయ్యప్పస్వామి గుడిలో ఈనెల 9న హుండీ చోరీకి యత్నించిన పాత నేరస్థుడిని క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వరాల ప్రకారం.. మేడ్చల్ పరిధి చింతల్‌లో ఉండే శ్రీరామ్ నర్సింహాచారి(38) డ్రైవర్‌గా పనిచేస్తూ విలాసాలకు బానిసై నేరాల బాట పట్టాడు. అతడు ఈనెల 9న అయ్యప్పస్వామి ఆలయంలో హుండీ చోరీకి యత్నించాడు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా శనివారం క్రైమ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు గత నెల చివరి వారంలో చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యాడు. అతడిపై హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో, జనగామ పరిధి పీఎస్‌లలో 23 పాత కేసులు నమోదయ్యాయి. తొలుత ఆలయాల్లో హుండీలు ఎత్తుకెళ్లి చోరీలకు పాల్పడేవాడు. దోచుకున్న డబ్బుతో గోవా తదితర ప్రాంతాల్లో జల్సాగా గడిపేవాడు. అతడు తాళాలు పగులగొట్టి ఇళ్లలోనూ చోరీలకు పాల్పడినట్లు సమాచారం. నేరం అంగీకరించడంతో అతడిని రిమాండుకు తరలించారు.

చెట్టుకు ఉరేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి

● పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న అస్తిపంజరం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి అస్తిపంజరం

హయత్‌నగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి,): సుమారు రెండు నెలల క్రితం చెట్టుకు ఉరేసుకుని మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం హయత్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని మృతిచెందడంతో శరీరం మొత్తం కుళ్ళిపోయి అస్తిపంజరం మాత్రమే మిగిలింది. కుంట్లూరు భూదాన్‌కాలనీలో నివాసముండే సారంగి వెంకటేష్ మేకల కాపరి. శనివారం ఉదయం మేకలను మేపడానికి వెళ్లాడు. గౌరెల్లి నుంచి బండ్లగూడకు వెళ్లే దారిలో ఇందుకూరి విల్లాస్ పక్కన చెట్ల పొదల్లో గుర్తుతెలియని వ్యక్తి వైరుతో చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. దాదాపు రెండు నెలలు కావస్తుండడంతో శవం మొత్తం కుళ్లిపోయి అస్తిపంజరం మిగిలింది. వెంటనే విషయాన్ని వెంకటేష్ హయత్‌నగర్ పోలీసులకు వివరించగా పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. పోలీసులు అస్తిపంజరాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పీవీటీ మార్కెట్ వార్షికోత్సవంలో కేక్ కట్ చేస్తున్న కైరంకొండ ధనుంజయ, చంద్రయ్య, శ్రీధర్, శ్రీనివాసులు, కృష్ణ, భిక్షపతి

ఘనంగా పీవీటీ మార్కెట్ వార్షికోత్సవం

ఎల్బీనగర్ : కొత్తపేటలోని పీవీటీ మార్కెట్ 21వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీవీటీ మర్చంట్ కమిటీ అధ్యక్షు డు కైరంకొండ ధనుంజయ, ఉపాధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి భువనగిరి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి తడక కృష్ణ, కోశాధికారి చెరుకు భిక్షపతి, డైరెక్టర్లు ప్రసాద్‌కుమార్, సురేష్, రెడ్డయ్య, పోచయ్య, రాజేంద్రప్రసాద్, రచ్చరాజు, ఫౌండర్స్ కమిటీ చైర్మన్ చిలువేరు చంద్రయ్య, భారత పురుషోత్తం, ఉపాధ్యక్షుడు బడుగు దానయ్య, ప్రధాన కార్యదర్శి మిర్యాల సోమయ్య, సహాయ కార్యదర్శి రచ్చ కృష్ణమూర్తి, కోశాధికారి కైరంకొండ సత్యనారాయణ, జెల్ల లక్ష్మీనారాయణ, పెంటయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి మహాపడిపూజ

ఎల్బీనగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): హరిహర పుత్ర అయ్యప్పస్వామి 18 కలశాల మహాపడిపూజ కార్యక్రమం న్యూమారుతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఫణికుమార్ గురుస్వామి, కౌశిక్ కన్నెస్వామి ఆధ్వర్యంలో రామచంద్రన్‌నాయర్ గురుస్వామి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ మహాపడిపూజ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రన్‌నాయర్ గురుస్వామి ఫణికుమార్ గురుస్వామికి మంత్రదండం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో గురు దత్తాత్రేయ జయంతి

ఎల్బీనగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గురు దత్తాత్రేయ జయంతి ఉత్సవాలు శనివారం పలు ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అల్కాపురిలోని శృంగేరి జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం శారదా పీఠం శృంగేరి శంకరమఠంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ కార్పొరేటర్ దేప సురేఖ, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. వేడుకల్లో మఠం ధర్మాధికారి కేవీ శ్రీనివాస్‌శర్మ, కేఎస్ మూర్తి, గౌరీభాస్కర్ పాల్గొన్నారు.

రేపు రంగారెడ్డి జిల్లా జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

ఎల్బీనగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలురు (70 కిలోల లోపు), జూనియర్ బాలికల (65 కిలోల లోపు) రంగారెడ్డి జిల్లా జట్ల ఎంపిక సరూర్‌నగర్ స్టేడియంలోని కబడ్డీ గ్రౌండ్‌లో సోమవారం సాయంత్రం 3గంటలకు నిర్వహించబడతాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. రవికుమార్, ప్రధాన కార్యదర్శి పి. సుధాకర్ రెడ్డిలు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులలో బాలికల జట్టు డిసెంబర్ 22 నుంచి 25 వరకు మేడ్చల్ జిల్లాలో జరుగనున్న అంతర్ జిల్లా పోటీల్లో రంగారెడ్డి జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. బాలుర జట్టు డిసెంబర్ 27 నుంచి 30 వరకు జనగామ జిల్లాలో నిర్వహించబడు 50వ జూనియర్ అంతర్ జిల్లా కబడ్డీ పోటీలలో రంగారెడ్డి జిల్లా తరఫున పాల్గొంటారని వారు తెలిపారు. 2005 జనవరి 12 తర్వాత పుట్టిన ఆసక్తిగల బాల, బాలికలు రంగారెడ్డి జిల్లా జూనియర్ కబడ్డీ జట్టు ఎంపికలో పాల్గొనాల్సిందిగా వారు కోరారు. వారు తమ ఆధార్ కార్డు తీసుకుని ఎంపికల్లో పాల్గొనాలని వారు సూచించారు. వివరాలకు జే. చంద్రమోహన్ (7661992581), ఈ. రాజు (9000038272)లలో సంప్రదించాలని సూచించారు.

డిప్యూటీ ఈఓ పోస్టులను భర్తీ చేయాలి

● టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా మహాసభ డిమాండ్

హైదరాబాద్ సిటీ : కామన్ సర్వీస్ రూల్స్‌తో సంబంధం లేని హైదరాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న డిప్యూటీ ఈఓ, డిప్యూటీ ఈఓ ఎస్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దోమలగూడలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో శనివారం హైదరాబాద్ జిల్లా మహాసభ నిర్వహించారు. సభలో ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, కార్యదర్శి సింహాచలం, రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ శారద మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకోవడానికి ఉపాధ్యాయులు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. జిల్లాలోని మహిళా ఉపాధ్యాయులు కూడా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం జరిగే పోరాటాలలో భాగస్వాములు కావాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞాన మంజరి నూతన కమిటీ ఎన్నికను నిర్వహించారు. 87మందితో ఏర్పాటు చేసిన కమిటీలో జిల్లా అధ్యక్షులుగా జి. రాజారావు, ప్రధాన కార్యదర్శిగా ఎ.శ్యామ్ సుందర్, ఉపాధ్యక్షులుగా కె. రేణు, ఈ. నాగరాజు, కోశాధికారిగా ఆర్. శారద, కార్యదర్శులుగా రమేష్‌బాబు, మధుసూదన్‌రావు, కవిత, బాషా, విశాలి, విద్యావతి, ఉదయ్‌కుమార్, రామస్వామి, ప్రభాకర్, ప్రసాద్‌లను ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వంశీ, సభ్యులను ఎన్నుకున్నారు.